సాక్షి ఖమ్మం

శుక్రవారం : 30 : ఆగస్టు : 2024



పెసల కొనుగోళ్లలో దగా

పెసల దిగుబడిపై రైతులు ఆవేదన చెందుతుండగా.. మరోపక్క వ్యాపారుల తీరుతో నష్టతీవ్రత పెరుగుతోంది. 8లో



క్రీడలు సైతం భాగమే..

విద్యలో క్రీడలు కూడా ఓ భాగమేనని పిల్లల తల్లిదండ్రులు గుర్తించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. 8లో

గరిష్టం / కనిష్టం
27° / 23°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రత కాస్త తక్కువగానే ఉంటుంది. కొన్నిప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

ప్రైవేట్ ల్యాబ్‌ల్లో డెంగీ పరీక్షలు చేయొద్దు

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల ల్యాబ్‌ల్లో రాపిడ్ పరీక్షల ద్వారా డెంగీ నిర్ధారించొద్దని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వరికూటి సుబ్బారావు ఆదేశించారు. శాంపిళ్లను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని ఐసీడీఎస్ ల్యాబ్‌కు పంపి ఎలీషా పరీక్షలు ద్వారా నిర్ధారించాకే చికిత్స చేయాలని స్పష్టం చేశారు. ఈ విషయమై గతంలోనే సూచించినా కొందరు పట్టించుకోకుండా ప్రజలకు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఇకనైనా అన్ని ఆస్పత్రుల బాధ్యులు శాంపిళ్లను ఐసీడీఎస్ ల్యాబ్‌కే పంపాలని, అలా చేయకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ ఓ ప్రకటనలో హెచ్చరించారు.

హెచ్‌ఐవీ ఎయిడ్స్ కట్టడికి స్క్రీనింగ్

ఖమ్మంవైద్యవిభాగం: గ్రామ స్థాయి వరకు హెచ్‌ఐవీ, ఎయిడ్స్, సుఖవ్యాధుల నియంత్రణపై అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వి.సుబ్బారావు సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లకు హెచ్‌ఐవీ స్క్రీనింగ్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ వ్యాధుల బారిన పడితే ఎదురయ్యే అనర్థాలపై అవగాహన కల్పిస్తూనే స్క్రీనింగ్ చేయాలని, హెచ్‌ఐవీ పాజిటివ్‌గా తేలిన వారిని ఐసీటీసీ కేంద్రాలకు పంపాలని తెలిపారు. తద్వారా వ్యాధి వ్యాప్తిని కట్టడి చేయొచ్చని చెప్పారు. ఇదే సమయాన వ్యాధి నమోదైన వారి వివరాలు గోప్యంగా ఉంచాలన్నారు. అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష, ప్రోగ్రాం ఆఫీసర్లు రామారావు, సైదులు, డాక్టర్ వెంకటరమణ మాట్లాడగా మెడికల్ ఆఫీసర్ బాలకృష్ణ, డెమో సాంబశివారెడ్డితో పాటు సత్యకుమార్, అలీ, వీరయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగికి అధికారి లేఖ?

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లోని ఓ ఇంజనీర్ అధికారి తమ విభాగంలో మహిళా సిబ్బందిని వేధిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ఓ మహిళా ఉద్యోగికి ఆయన ఆరోగ్య జాగ్రత్తలు సూచిస్తూ లేఖ రాయగా.. ఆమె ప్రశ్నించడంతో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిందని సమాచారం. దీంతో ఆ అధికారిని పిలిచి మందలించినట్లు తెలిసింది. అయితే, విషయం కమిషనర్, మేయర్ దృష్టికి వెళ్లకుండా జాగ్రత్త పడుతూ అధికారిపై చర్యలు లేకుండానే సమస్య సద్దుమణిగేలా చూస్తున్నారని తెలిసింది.

నర్సరీ చట్టం నిబంధనలు కచ్చితంగా పాటించాలి



మాట్లాడుతున్న అధికారి మధుసూదన్

రఘునాథపాలెం/కూసుమంచి: కల్తీ మిర్చి నారుతో రైతులు నష్టపోకుండా ఉద్యాన శాఖ ద్వారా ప్రభుత్వం నర్సరీ చట్టాన్ని అమలుచేస్తోందని, ఇందులోని నిబంధనలను నర్సరీల నిర్వాహకులు నిబంధనలను తప్పక పాటించాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎం.వీ.మధుసూదన్ సూచించారు. రఘునాథపాలెం, కూసుమంచి మండలం గట్టుసింగారంలోని రైతువేదికల్లో గురువారం నర్సరీల నిర్వాహకులతో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. లైసెన్స్ లేకుండా నర్సరీ నిర్వహించినా, అనుమతి లేని కంపెనీల విత్తనాలతో నారు సిద్ధం చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతేకాక అన్ని వివరాలను రిజిస్టర్లలో నమోదు చేయాలని, ప్రతీ అమ్మకంపై రైతులకు బిల్లు ఇవ్వాలని తెలిపారు. ఈసమావేశాల్లో ఏడీఏలు కె.వెంకటేశ్వరరావు, సరిత, ఉద్యాన అధికారులు జి.నగేష్, పి.అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు రిటైర్డ్ ఐఏఎస్ మురళి

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రంలో విద్యావ్యవస్థను పటిష్టపరుస్తామని ప్రభుత్వం ప్రస్తుత పరిస్థితులపై పరిశీలనకు సిద్ధమైనట్లు తెలిసింది. ఖమ్మం జిల్లా నుంచి డిప్యూటీ సీఎం, ఇద్దరు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తుండడంతో ఇక్కడి నుంచే పరిశీలన మొదలుపెట్టాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇందులో భాగంగా శుక్రవారం జిల్లాకు రానున్న రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి మధిర నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులు, విద్యార్థులకు అందుతున్న బోధనను పరిశీలిస్తారని.. ఆపై మిగతా నియోజకవర్గాల్లోనూ ఆరా తీయనున్నట్లు తెలిసింది. అంతర్జాతీయ స్థాయి పాఠశాలలను కొండగల్, మధిరలో ఏర్పాటుచేయాలని ఇప్పటికే నిర్ణయించగా పరిశీలనకు మధిర నియోజకవర్గాన్ని ఎంచుకున్నట్లు సమాచారం. ఈమేరకు పూర్తి వివరాలతో నివేదిక సిద్ధం చేసినట్లు ఓ అధికారి తెలిపారు.



ఖానాపురం ఊరచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిని నిర్ధారిస్తూ వేసిన దిమ్మె



గ్రానైట్ రాళ్లతో సగం మేర మూసుకుపోయిన దిమ్మె



కనుమరుగయ్యే స్థితిలో...

వదిలేసినట్లేనా ?!

యథేచ్ఛగా చెరువు శిఖం భూముల కబ్జా

- నానాటికీ తగ్గిపోతున్న చెరువుల విస్తీర్ణం
- ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లను పూడుస్తున్న అక్రమార్కులు
- ఖానాపురం ఊరచెరువు, వెలుగుమట్ల చెరువులపై బడాబాబుల కన్ను
- రూ.కోట్ల విలువైన స్థలం ఆక్రమణకు గురవుతున్నా పట్టని యంత్రాంగం



ఖానాపురం ఊర చెరువు పరిధిలో ఆక్రమణకు గురైన భూమి

- ఖమ్మం–ఇల్లెందు రోడ్డులో కుడివైపు ఖానాపురం చెరువు ఉంటుంది. ఎడమ వైపున సైతం ఈ చెరువుకు సంబంధించి 320 గజాలు మిగిలింది. దీనిని ప్రైవేట్ వ్యక్తులు మరో సర్వేనంబర్‌తో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అంతే కాక మూడేళ్ల నుంచి ఎఫ్‌టీఎల్ హద్దు రాళ్లనూ పూడుస్తున్నారు.

సాక్షిప్రతినిధి, ఖమ్మం: మానవ మనుగడలో కీలకమైన చెరువులు కబ్జా బారిన పడుతూ నానాటికీ కుచించుకుపోతున్నాయి. ఆక్రమణదారులు యథేచ్ఛగా చెరువు శిఖం భూముల్లోనే నిర్మాణాలు చేపడుతున్నా రెవెన్యూ, జలవనరుల శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. అధికార ప్రాబల్యం, ఇతర కారణాలతో ఆక్రమణలకు అడ్డుకట్ట పడడం లేదు. ఇదిలాగే సాగితే భవిష్యత్‌లో చెరువులన్నీ కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఖమ్మం నగరంతోపాటు జిల్లావ్యాప్తంగా అనేక చెరువుల ఎఫ్‌టీఎల్(ఫుల్ ట్యాంక్ లెవల్), బఫర్ జోన్లను పూడుస్తూ ఆక్రమణలు చేస్తుండడం గమనార్హం. ప్రధానంగా జిల్లా కేంద్రంలోని పలు చెరువులు కబ్జా చెరలో చిక్కుకున్నప్పటికీ పట్టించుకోని యంత్రాంగం.. అప్పుడప్పుడు ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నామని చెబుతూ ఆతర్వాత వదిలేస్తోంది. ఫలితంగా ఏ ప్రభుత్వం వచ్చినా రూ.కోట్ల విలువ చేసే స్థలం ఆక్రమణలు ఆగడం లేదు.

బఫర్‌జోన్‌లో కట్టడాలు

చెరువు శిఖంతోపాటు బఫర్‌జోన్లూ ఆక్రమణకు గురవుతున్నాయి. ఖమ్మం నగరంతోపాటు సత్తుపల్లి, మధిర, వైరా పట్టణాలకు సమీపాన చెరువు భూముల విస్తీర్ణం ఏటా తగ్గుతోంది. ఇక్కడ భూములకు డిమాండ్ ఉండడంతో చెరువుల భూములను ఆక్రమిస్తున్నారు. ఖమ్మం నడిబొడ్డున ఉన్న మున్నేరు బఫర్‌జోన్‌తో పాటు మున్నేరును ఆనుకునే నిర్మాణాలు చేపట్టారు. గతంలోనే బఫర్ జోన్‌లో 40 ఇళ్లు కట్టినట్లు జలవనరుల శాఖ అధికారులు గుర్తించగా ఈ సంఖ్య ప్రస్తుతం చాలా పెరిగింది. గత ఏడాది మున్నేరుకు వరదలు వచ్చిన సమయాన ఇళ్లన్నీ మునిగిపోయాయి. వరదలు ఎప్పుడు వచ్చినా మున్నేరు చుట్టుపక్కల దాదాపు 11 కాలనీలకు రక్షణ లేకుండా పోయింది. లోతట్టు ప్రాంతాల్లోకి నీరు రాకుండా గత ప్రభుత్వం రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించినప్పటికీ పనులు నత్తనడకన సాగుతున్నాయి.

హద్దు రాళ్లను చెరిపేశారు..

ఖమ్మం–ఇల్లెందు ప్రధాన రహదారికి సమీపాన సర్వేనంబర్ 13లో ఖానాపురం ఊర చెరువు 74 ఎకరాల్లో ఉంటుంది. ఈ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధి 24 ఎకరాలు కలిపితే మొత్తం విస్తీర్ణం 98 ఎకరాలుగా రికార్డుల్లో నమోదైంది. గతంలో ఈ చెరువు ద్వారా 200 ఎకరాలకు సాగునీరు అందేది. ప్రస్తుతం ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు చేపట్టడమే కాక బఫర్‌జోన్‌లో 38 ఇళ్లను నిర్మించారు. ఇందులో పదింటికి ప్రభుత్వం పట్టాలు సైతం మంజూరు చేసింది. ఇక మూడింటిని అధికారులు కూల్చివేశారు. ఈ చెరువు ఇల్లెందు ప్రధాన రహదారికి సమీపాన ఉండడంతో గజం భూమి ధర రూ.50 వేలకు పైగానే పలుకుతోంది. ఈక్రమాన పలువురు ఎఫ్‌టీఎల్ హద్దురాళ్లను కూడా పూడ్చేశారు.

ఈ చెరువులన్నీ ఆక్రమణల్లోనే..

ఖమ్మం నగర సమీపాన పలు చెరువుల భూములు ఆక్రమణకు గురైనట్లు జలవనరుల శాఖ అధికారులు కొన్నాళ్ల క్రితం గుర్తించారు. అయితే, వారు గుర్తించని చెరువులు ఇంకా చాలానే ఉన్నాయని తెలుస్తోంది.

- లకారం చెరువు 163 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా, గతంలో 126 ఎకరాల ఆయకట్టు ఉంది. నగరం అభివృద్ధి చెందుతుండడంతో చెరువు భూములన్నీ నివాసాలుగా మారాయి. 2014–15లో 'మిషన్ కాకతీయ'లో భాగంగా 150 తాత్కాలిక ఇళ్లను తొలగించి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం లకారం ట్యాంక్‌బండ్, రిజర్వాయర్ కలిపి 134 ఎకరాల్లో ఉన్నట్లు చెబుతున్నా చెరువుకు నీళ్లు వచ్చే కాల్వ, తూము కాల్వలను పూడ్చి కబ్జా చేస్తున్నారు.
- సర్వేనంబర్ 178లో ధంసలాపురం చెరువు శిఖం 128.14 ఎకరాలు, ఎఫ్‌టీఎల్ 142 ఎకరాలుగా ఉంది. గతంలో ఎఫ్‌టీఎల్ పరిధిలోని 10 ఎకరాల్లో వెంచర్ వేయడమే కాక మరో రెండు ప్లాట్లలో మట్టి తోలి ఎత్తు పెంచారు. ఒక ప్లాట్‌కు ప్రహరీ కూడా నిర్మించారు. రూ.కోట్ల విలువైన చెరువు శిఖం కబ్జా అవుతోందని తెలిసినా ఫెన్సింగ్ వేయించడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు.
- 61వ సర్వేనంబర్‌లోని 28.34 ఎకరాల్లో బల్లేపల్లి చెరువు ఉంది. రఘునాథపాలెం రెవెన్యూ పరిధిలోకి వచ్చే ఎఫ్‌టీఎల్ భూమిలో కొందరు మట్టితో చదును చేయించారు. అయినా అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు.
- వెలుగుమట్ల(గొల్లగూడెం) చెరువు 164 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ చెరువు చింతకాని మేజర్‌కు కుడి వైపున ఉన్నప్పటికీ ఎడమవైపున మరో రెండు ఎకరాలు చెరువు స్థలం ఉంటుంది. ప్రస్తుతం ఈ స్థలమంతా కబ్జా అయింది. గతంలో జలవనరుల శాఖ అధికారులు ఏర్పాటుచేసిన బోర్డు కూడా కనిపించడం లేదు.
- రఘునాథపాలెంలో మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దిన చెరువు పరిధిలో పది ఎకరాలను గతంలోనే పట్టేదార్లు ప్లాట్లు చేసి అమ్ముకున్నారు. దాదాపు 250 మంది పేద, మధ్యతరగతి ప్రజలు వీటిని కొనుగోలు చేసినా ఇంటి నిర్మాణాలకు అనుమతి రాలేదు.

సర్వే సరే.. సిబ్బంది ఎక్కడ?

- టౌన్ ప్లానింగ్ విభాగంలో టీపీఎస్‌ల కొరత
- కేఎంసీలో ఇద్దరు.. సత్తుపల్లి, మధిరకు కలిపి ఒక్కరే..
- ఫలితంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో జాప్యం



ఖమ్మంలో సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్ అభిషేక్ (ఫైల్)

ఖమ్మంమయూరిసెంటర్: ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన, పరిష్కారం త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వం సూచిస్తున్నా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. మూడు నెలల్లో దరఖాస్తులన్నింటినీ క్షేత్రస్థాయిలో పరిశీలించి అప్‌లోడ్ చేయాలని ప్రభుత్వం ఇటీవల ఆదేశించింది. అయితే జిల్లాలో సర్వేను చూస్తే ఏడాదైనా పూర్తయ్యేలా కానరావడం లేదు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌తోపాటు సత్తుపల్లి, మధిర, వైరా మున్సిపాలిటీల్లో 51,425 దరఖాస్తులు వచ్చాయి. కానీ సర్వే చేసే సిబ్బంది సంఖ్య చాలా తక్కువగా ఉండడంతో ఎప్పటికి పూర్తవుతుందో తెలియడం లేదు.

టీపీఎస్‌ల కొరత

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో గతంలో ఐదుగురు టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు(టీపీఎస్) ఉండేవారు. కానీ ఇప్పుడు ఇద్దరు బదిలీపై వెళ్లగా.. మరొకరు సెలవులో ఉన్నారు. దీంతో మిగిలిన ఇద్దరే ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో పాలుపంచుకుంటున్నారు. నాలుగేళ్ల క్రితం ఐదుగురు టీపీఎస్‌లు ఉన్నప్పుడు 10వేల దరఖాస్తుల పరిశీలన పూర్తయింది. ఇక సత్తుపల్లిలో ఉన్న టీపీఎస్‌కే మధిర ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. వైరాలో సైతం ఒకరే టీపీఎస్ ఉండడంతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన, సర్వేలో జాప్యం జరుగుతోందని చెబుతున్నారు.

పనిభారంతో సతమతం

ఉద్యోగుల కొరతకు తోడు ఉన్న వారిపై పనిభారం పడుతోంది. గతంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన కార్యాలయాల్లోనే జరిగేది. ప్రభుత్వం ఇప్పుడు మొబైల్ యాప్‌ను ప్రవేశపెట్టి ఉద్యోగి తప్పనిసరి క్షేత్రస్థాయికి వెళ్లి స్థలం చుట్టూ తిరిగి హద్దులకు మార్కింగ్ ఇవ్వడంతోపాటు జియో ట్యాగింగ్ చేయాలి. అలాగే యాప్‌లో దరఖాస్తుదారుడి వివరాలను 15 కాలమ్స్‌లో నమోదు చేయాలి. ఇలా ఒక్కో దరఖాస్తు వివరాల నమోదుకు గంట నుంచి రెండు గంటల వరకు పడుతుందని సమాచారం. సర్వర్ నెమ్మదిస్తే ప్రక్రియలో మరింత జాప్యం జరుగుతుంది. ఇవి కాక మున్సిపాలిటీల్లో ఇంటి నిర్మాణాల అనుమతుల కోసం వచ్చే దరఖాస్తులను సైతం టీపీఎస్‌లే పరిశీలించి సిఫారసు చేయాల్సి ఉంది. మరోపక్క కార్యాలయంలో పనులను చక్కబెట్టుకోవాలి. ఇలా రకరకాల పనులతో ఉద్యోగులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నట్లు తెలుస్తోంది.

ఇప్పటి వరకు 70 దరఖాస్తులే..

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎల్ఆర్ఎస్ కోసం 39,945 దరఖాస్తులు రాగా.. ఇప్పటి వరకు 15,060 దరఖాస్తుల పరిశీలన పూర్తయింది. ఇక మిగిలిన 24వేల దరఖాస్తుల పరిశీలన ఇటీవల మొదలుపెట్టగా ఉద్యోగి కొరతతో వారం రోజుల్లో 70 దరఖాస్తులను మాత్రమే పరిశీలించగలిగారు. ఈ లెక్కన మిగిలినవి ఎప్పటికి పూర్తవుతాయనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఇక మధిర, సత్తుపల్లి, వైరా మున్సిపాలిటీల్లో సర్వే ప్రక్రియ ఎంత మేరకు జరిగిందో సమాచారం ఇచ్చే పరిస్థితి కూడా లేదు. ఇకనైనా ప్రభుత్వం అదనపు సిబ్బందిని కేటాయించకపోతే ఎల్ఆర్ఎస్ దరఖాస్తు సర్వే మరింత ఆలస్యం కానుంది.

ప్రజలకు అవగాహన.. భాగస్వామ్యం

- తద్వారా సీజనల్ వ్యాధులకు చెక్
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

తిరుమలాయపాలెం: పారిశుద్ధ్య కార్యక్రమాల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారిని భాగస్వాములను చేయడం ద్వారా సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. జ్వరాల తీవ్రత నేపథ్యాన మండలంలోని అజ్మీరాతండా, తిప్పారెడ్డిగూడెంల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈసందర్భంగా జ్వర పీడితులతో మాట్లాడిన కలెక్టర్ పారిశుద్ధ్య పనులు, వైద్యశిబిరాల నిర్వహణపై ఉద్యోగులకు సూచనలు చేశారు. గ్రామానికి తాగునీరు సరఫరా చేసే బావి చెరువు సరిహద్దులో ఉన్నందున అందులోకి చెత్తాచెదారం, మురుగు నీరు చేరుతోందని అజ్మీరా తండా వాసులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన పొలం గట్లపై నడిచి వెళ్లి మరీ బావిని పరిశీలించి చుట్టూ రక్షణగోడ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే, రహదారి పక్కన ప్రమాదకరంగా మారిన పాడుబడిన బావిని పూడ్చాలని తెలిపారు. అనంతరం తిప్పారెడ్డిగూడెంలో పర్యటన సందర్భంగా డ్రెయిన్ నిర్మాణం అస్తవ్యస్తంగా ఉండడంతో పీఆర్ అధికారులకు ఫోన్ చేసి కాంట్రాక్టర్‌కు బిల్లు నిలిపివేయాలని ఆదేశించారు. అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ, డీఎంహెచ్‌ఓ వి.సుబ్బారావు, తహసీల్దార్ పీ.వీ.రామకృష్ణ ఎంపీడీఓ సిలార్ సాహెబ్, ఆర్‌ఐ లహరి, గ్రామపంచాయతీ కార్యదర్శి అనూష తదితరులు పాల్గొన్నారు.



అజ్మీరాతండాలో తాగునీటి బావి పరిశీలనకు పొలం గట్ల పైనుంచి వెళ్తున్న కలెక్టర్

పకడ్బందీగా ఓటరు జాబితా

ఖమ్మం సహకారనగర్: గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి గురువారం ఆయన వీసీ ద్వారా మాట్లాడుతూ జీపీల్లో వార్డుల వారీగా 18ఏళ్లు నిండిన వారికి ఓటుహక్కు కల్పించి ఫొటోతో కూడిన ఓటర్ జాబితా రూపకల్పన చేయాలన్నారు. అలాగే, బ్యాలెట్ బాక్స్‌ల లభ్యత, రిటర్నింగ్ అధికారులకు గుర్తింపు, శిక్షణపై సూచనలు చేశారు. జిల్లా నుంచి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. కాగా, జిల్లాలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, డీపీఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు.

కలెక్టరేట్‌లో బ్యాంక్ శాఖ, ఏటీఎం

కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎస్‌బీఐ శాఖ, ఏటీఎంను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రారంభించారు.



బ్యాంక్ శాఖను ప్రారంభిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ మధుసూదన్

బ్యాంక్‌లో అన్ని రకాల సేవలు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారంలో వేగం


రెవెన్యూ సంబంధిత సమస్యలను పరిష్కరించడంలో వేగం పెంచాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆయన ధరణి, ప్రజావాణి దరఖాస్తులు, ప్రభుత్వ భూముల పరిరక్షణ, ఓటరు జాబితా సవరణపై అధికారులతో సమీక్షించారు. ధరణి దరఖాస్తులు 8,800కు పైగా పెండింగ్‌లో ఉన్నందున పరిష్కరించాలన్నారు. ఆక్రమణలకు గురైన ప్రభుత్వ స్థలాల స్వాధీనం, ఫెన్సింగ్ ఏర్పాటుపై సూచనలు చేశారు. ఈ సమావేశాల్లో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ, డీఆర్‌డీఓ సన్యాసయ్య, జెడ్పీ సీఈఓ దీక్ష రైనా, ఇన్‌చార్జి డీపీఓ నాగలక్ష్మి, డీఆర్వో ఎం.రాజేశ్వరి, ఎల్‌డీఎం శ్రీనివాసరెడ్డి, ఆర్డీఓలు గణేష్, రాజేందర్, కలెక్టరేట్ ఏఓ అరుణ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ప్రశాంత వాతావరణంలో గణేశ్ ఉత్సవాలు

ఉత్సవ కమిటీలు, పీస్ కమిటీ సమావేశంలో సీపీ సునీల్‌దత్



నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీపీ సునీల్‌దత్, అధికారులు

ఖమ్మంక్రైం: వినాయక నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యేలా అందరూ సహకరించాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ సూచించారు. వచ్చే నెల నుంచి గణేశ్ నవరాత్రులు మొదలుకానున్న నేపథ్యాన ఖమ్మంలో గురువారం గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, పీస్ కమిటీ బాధ్యులతో ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ ఉత్సవాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. ప్రతీ మండపం నిర్వాహకులు స్థలం యజమాని ధ్రువీకరణ పత్రంతో పాటు విద్యుత్ సహా అన్ని శాఖల అనుమతి పత్రాలతో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఇక మండపాల్లో డీజే ఏర్పాటుకు అనుమతించబోమని, ప్రతీ విగ్రహం వద్ద 24గంటల పాటు వలంటీర్లు ఉండాలని కమిషనర్ స్పష్టం చేశారు.

నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు...

గణేష్ విగ్రహాల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నామని సీపీ సునీల్‌దత్ తెలిపారు. ఎంపిక చేసిన చెరువుల వద్ద క్రేన్లు సమకూర్చడమేకాక పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేస్తామని, గజ ఈతగాళ్లను నియమిస్తామని చెప్పారు. ఈసమావేశం అనంతరం సీపీ సునీల్‌దత్, అధికారులు గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేయనున్న కాల్వొడ్డు, మున్నేరు, ఖమ్మం రూరల్ మండలం పెద్దతండా వైపు మున్నేరు వద్ద పరిశీలించి ఏర్పాట్లపై సూచనలు చేశారు. అదనపు డీసీపీ ప్రసాద్‌రావు, ఏసీపీలు రమణమూర్తి, శ్రీనివాసులు, సాంబరాజు, సీఐలు ఉదయ్‌కుమార్, బాలకృష్ణ, రమేష్, భానుప్రకాష్, మోహన్‌బాబు, సతీష్, ఉత్సవ కమిటీల సభ్యులు వినోద్ లాహోటి, జైపాల్‌రెడ్డి, సుధాకర్, రామారావు, విద్యాసాగర్, పీస్ కమిటీ సభ్యులు హఫీజ్ జావిద్, అజీజ్, ఆసిఫ్, ఖాసిం, తౌఫిజ్ అహ్మద్, జమాల్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

పెసల కొనుగోళ్లలో దగా

వ్యాపారుల తీరుతో రైతులకు దక్కని మద్దతు ధర

- క్వింటాకు రూ.3 వేలకు పైగానే నష్టపోతున్న వైనం
- నేటి నుంచి రంగంలోకి మార్క్‌ఫెడ్


ఖమ్మం మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన పెసలు

ఖమ్మంవ్యవసాయం: ప్రభుత్వం తరఫున కొనుగోళ్లు లేకపోవడంతో పెసలకు కనీస మద్దతు ధర లభించని దుస్థితి నెలకొంది. వ్యాపారులు ఇష్టారాజ్యంగా ధరలు నిర్ణయించి రైతులను దగా చేస్తున్నారు. అపరాల్లో మెట్ట పంటగా రైతులు పెసర సాగు చేస్తుంటారు. తక్కువ కాలపరిమితితో చేతికి వస్తుండడంతో వానాకాలం, యాసంగిలోనూ సాగు చేసి ఆతర్వాత నీటి వనరుల ఆధారంగా మిర్చి, మొక్కజొన్న వంటి పంటలను వేస్తారు. ఈ వానాకాలంలో జిల్లాలోని 25వేల ఎకరాల్లో పెసర సాగవుతుందని అధికారులు భావించినా గత సీజన్‌లో ప్రకృతి వైపరీత్యాలు, నష్టాలను దృష్టిలో పెట్టుకుని రైతులు 14,192 ఎకరాలకే పరిమితమయ్యారు. అయితే, వర్షాలు అనుకూలించడం కొంత మేర ప్రయోజనం కలిగిస్తుందని చెబుతున్నా ఆశించిన స్థాయిలో దిగుబడి లేక ఓపక్క.. ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో వ్యాపారుల తీరుతో ఇంకో పక్క నష్టం ఎదురవుతోందని వాపోతున్నారు.

వ్యాపారి చెప్పిందే వేదం

కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది పెసలు క్వింటాకు రూ.8,682గా మద్దతు నిర్ణయించింది. అయితే, ఈ ధర రైతులకు ఎక్కడా లభించటం లేదు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే కాస్త ఊరట దక్కేది. అలా జరగకపోవడంతో వ్యాపారులు క్వింటాకు రూ.4,500 నుంచి రూ. 5వేలకు మించి చెల్లించడం లేదు. ఇక ఖమ్మం మార్కెట్‌లో రూ.5వేల నుంచి రూ.6 వేల వరకు కొనుగోళ్లు చేస్తున్నారు. పంటకు డిమాండ్ ఉందని తెలిసినా వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడడంతో రైతులకు ప్రయోజనం ఉండడం లేదు. ఒకవేళ స్థానికేతర వ్యాపారులు ముందుకొచ్చినా ఇక్కడి వ్యాపారులు అడ్డుకుంటున్నట్లు తెలిసింది. అంతేకాక ఈ–నామ్‌ను విధానాన్ని తుంగలో తొక్కి జెండా పాట పద్ధతిలోనే కొనుగోలు చేస్తుండడం గమనార్హం. ఏదిఏమైనా రైతులు క్వింటాకుకు రూ.3 వేలకు పైగానే నష్టపోతున్నారు. పైరు పూత, కాత దశలో విపరీతమైన వర్షాలు రావడంతో దిగుబడిపై ప్రభావం పడింది. ఎకరాకు రెండు నుంచి మూడు క్వింటాళ్లకు మించి దిగుబడి రాకపోగా, ఎకరం సాగుకు రూ.15 వేల వరకు పెట్టుబడి పెట్టారు. ఇప్పుడు పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.


పెసల నాణ్యతను పరిశీలిస్తున్న వ్యాపారులు

ప్రయోజనం లేదు.. శ్రమ వృథా



రెండెకరాల్లో పెసర సాగు చేస్తే ఎకరాకు మూడే క్వింటాళ్లే దిగుబడి వచ్చింది. క్వింటాకు కనీసం రూ.7 వేల వరకు ధర పలుకుతుందని అనుకుంటే రూ.6వేలకు మించి రాలేదు. వ్యాపారులు నిర్ణయించిన ధరకు పెట్టుబడి కూడా పూడదు. పెసర సాగుతో ప్రయోజనం లేకపోగా శ్రమ కూడా వృథా అయింది.

– తుప్పతి చిననర్సయ్య, తనికెళ్ల

నేటి నుంచి మార్క్‌ఫెడ్ కొనుగోళ్లు

పెసలను వ్యాపారులు ఇష్టారాజ్యంగా ధర నిర్ణయిస్తున్నారని తెలియడంతో రైతులు నష్టపోకుండా చూసేలా ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పెసలు కొనుగోలు చేయాలని మార్క్‌ఫెడ్‌ను ఆదేశించడంతో అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ గురువారం సాయంత్రం మార్క్‌ఫెడ్ మేనేజర్ సునీత, మార్కెటింగ్, సహకార శాఖల అధికారులతో సమావేశమై సూచనలు చేశారు. జిల్లాలోని ఖమ్మం, వైరా, మధిర మార్కెట్లలో డీసీఎంఎస్ ద్వారా కొనుగోలు చేయనుండగా, ఖమ్మం మార్కెట్‌లో కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభిస్తారు.

విద్యలో క్రీడలు సైతం భాగమే...

- ధ్యాన్‌చంద్ జయంతి వేడుకల్లో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం

ఖమ్మం స్పోర్ట్స్: విద్యలో అంతర్భాగమైన క్రీడలను నిర్లక్ష్యం చేయకుండా ప్రతీ కుటుంబం తమ పిల్లల ఆసక్తి మేరకు శిక్షణ ఇప్పించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా గురువారం నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడారు. పిల్లలకు క్రీడలపై అవగాహన కల్పించి మైదానాలకు తీసుకురావాలని తెలిపారు. అంతేకాక ప్రతి ఒక్కరు వ్యాయామంపై దృష్టి సారిస్తే సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని చెప్పారు. అనంతరం అసిస్టెంట్‌కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ మాట్లాడగా డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పోటీలు

జిల్లాస్థాయి ప్రభుత్వ ఉద్యోగుల క్రీడాపోటీలు ముగియగా విజేతలక ుకలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ బహుమతులు అందజేశారు. మహిళల టగ్ ఆఫ్ వార్‌లో ఎక్సైజ్, అటవీ శాఖ ఉద్యోగులు మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. అలాగే, టెన్నికాయిట్‌లో వి.లలిత, ఎస్.కే.నజీమా, అనిమాల, డబుల్స్‌లో ఎం.రాణి, ఎం.రోజారాణి, టి.జ్ఞానలత, డీ.ఎం.నిర్మల జట్లు మొదటి మూడు స్థానాలు దక్కించుకున్నాయి. 100 మీటర్ల పరుగులో బి.వీరలక్ష్మి, కె.లావణ్య, ఎస్.కే.నజీమా, లెమన్ అండ్ స్పూన్‌లో సీహెచ్.కవిత, బి.శిరీష, 50 మీటర్ల పరుగులో డి.జయశ్రీ, కె.లావణ్య, ఎస్.కే.హసీనా విజేతలుగా నిలిచారు. త్రోబాల్‌లో రెవెన్యూ, ఎక్సైజ్‌శాఖల ఉద్యోగులు మొదటి రెండు స్థానాలు దక్కించుకున్నారు. పురుషుల విభాగం 100 మీటర్ల పరుగులో కె.తిరుపతి, బి.రవి, బి.రవికుమార్, 50 మీటర్ల పరుగులో కె.తిరుపతి, బి.రవి, బి.రవికుమార్ విజయం సాధించారు. వాలీబాల్‌లో విద్యాశాఖ, ఆయుష్ డిపార్ట్‌మెంట్లు మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి. 400మీటర్ల పరుగులో బి.సత్యనారాయణ, కె.యోహాన్‌లు ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. అలాగే, బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో ఎం.ఉపేందర్, బి.చంటి, టేబుల్ టెన్నిస్‌లో సీహెచ్.నరేష్, భువనేష్, డాక్టర్ ఎస్.కృష్ణచైతన్య విజేతలుగా నిలిచారు. కాగా, వివిధ విభాగాల్లో విజేతలుగా నిలిచిన మార్కెటింగ్ శాఖ ఉద్యోగులను జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఎ.అలీం, ఖమ్మం మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ అభినందించారు.


ట్రోఫీ అందుకుంటున్న మార్కెటింగ్ శాఖ ఉద్యోగులు


మహిళా ఉద్యోగులకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

వైద్య, ఆరోగ్యశాఖను ప్రక్షాళన చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: సీజనల్ వ్యాధులను అరికట్టడంతో పాటు బాధితులకు మెరుగైన వైద్యం అందించడంలో ప్రభుత్వాస్పత్రులు విఫలమైన నేపథ్యాన వైద్య, ఆరోగ్య శాఖను ప్రక్షాళన చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యం అందక, ప్రైవేట్ వైద్యం పొందలేక ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ అనుబంధ ప్రజాసంఘాల సమావేశం గురువారం ఖమ్మంలోని గిరి ప్రసాద్ భవనంలో జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసమావేశంలో హేమంతరావు మాట్లాడుతూ జిల్లాలోని ప్రతీ ఇంట్లో జ్వర పీడితులు ఉన్నందున ఇకనైనా మెరుగైన చికిత్స అందించాలని, డెంగీతో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కాగా, పార్టీ 100వ సంవత్సరంలోకి అడుగిడుతున్న వేళ ప్రజా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు డిసెంబర్ 26వ తేదీలోపు నిర్మాణాన్ని పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న హేమంతరావు

ఒకే బెడ్‌పై ఇద్దరికి వైద్యమా?

నేలకొండపల్లి: సీజనల్ జ్వరాలు పెరుగుతున్నాయని తెలిసినా ప్రభుత్వ ఆస్పత్రిలో కనీస సౌకర్యాలు కల్పించకపోవడ గర్హనీయమని బీజేపీ నాయకుడు తాండ్ర వినోద్‌రావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఆస్పత్రిని గురువారం ఆయన పరిశీలించగా ఒక్కో బెడ్‌పై ఇద్దరు చొప్పున వ్యక్తులకు వైద్యం అందిస్తుండడాన్ని గుర్తించారు. అనంతరం వైద్యాధికారి మంగళతో మాట్లాడిన వినోద్‌రావు కనీసం వంద పడకలు ఏర్పాటుచేయాలని కోరారు. అనంతరం మండల కేంద్రంలో ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని నిరసన తెలిపారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్, నాయకులు మన్నె కృష్ణారావు, పాగర్తి సుధాకర్, సూరేపల్లి జ్ఞానరత్నం, షేక్ షర్ఫుద్దీన్, సయ్యద్ మెహినుద్దీన్, తొగాటి నాగచారి, కందరబోయిన వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


చికిత్స పొందుతున్న వారితో మాట్లాడుతున్న నాయకులు

ఈఎంఐ చెల్లించలేదని దాడి

వైరారూరల్: బజాజ్ ప్రైవేట్ సంస్థ ద్వారా రుణంపై వస్తువులు కొనుగోలు చేసిన వ్యక్తి ఈఎంఐ చెల్లించలేదనే నెపంతో సిబ్బంది దాడి చేశారంటూ ఓ వ్యక్తి గురువారం రాత్రి లబ్ధిదారుడు వైరా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే, నగదు కోసం వెళ్తే తమపైనే దాడికి పాల్పడడమే కాక పోలీసులకు ఫిర్యాదు చేశారని ఉద్యోగి చెబుతుండడం గమనార్హం. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. వైరాకు చెందిన నారపోగు లక్ష్మణరావు – సుజాత దంపతులు 14 నెలల కిందట బజాజ్ సంస్థ ద్వారా రూ.15 వేలు విలువ చేసే బీరువా, పరుపును కొనుగోలు చేసి నెలకు రూ.1,100 చొప్పున చెల్లిస్తున్నారు. ఇప్పటి వరకు 11 నెలలు కట్టినా ఈ నెల వాయిదా చెల్లించలేదు. దీంతో బజాజ్ సంస్థఉద్యోగి ఉపేందర్ గురువారం లక్ష్మణరావు ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో తన భార్య లేదని, ఆమె రాగానే నగదు చెల్లిస్తానని చెప్పినా ఉపేందర్ వినకుండా తనను కొట్టాడని లక్ష్మణరావు ఫిర్యాదులో పేర్కొన్నాడు. అయితే, నగదు కోసం లక్ష్మణరావు ఇంటికి వెళ్తే ఆయన తనపై దాడి చేసి మెడలో బంగారపు గొలుసు తెంపడమే కాక పోలీసులకు ఫిర్యాదు చేశాడని ఉపేందర్ ఆవేదన వ్యక్తం చేశాడు.

పొలంలోకి దూసుకెళ్లి బోల్తా పడిన కారు


పొలంలో పల్టీ కొట్టిన కారు

నేలకొండపల్లి: మండలంలో ప్రమాదవశాత్తు కారు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లడంతో పాటు బోల్తా పడింది. ఈ ఘటన వివరాలు... ముదిగొండ మండలం మల్లారానికి చెందిన యువకులు గురువారం నేలకొండపల్లి మండలంలోని చెరువుమాధారం చెరువు వద్దకు వచ్చారు. అక్కడ పార్క్‌లో గడిపాక తిరిగి వెళ్తుండగా అజయ్‌తండా సమీపాన కారు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్తూ బోల్తా పడింది. ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు స్వల్పంగా గాయపడిన శ్రీకాంత్, మధు, విజయ్, నవీన్, మురళిని బయటకు తీసి ఖమ్మం తరలించారు. అనంతరం జేసీబీ సాయంతో కారును బయటకు తీశారు.

జ్వరంతో ఆరేళ్ల చిన్నారి మృతి


బత్తిని మహన్య (ఫైల్)

తిరుమలాయపాలెం: మండలంలోని దమ్మాయిగూడెంలో జ్వరంతో బాధపడుతున్న ఓ చిన్నారి మృతి చెందింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. దమ్మాయిగూడెంకు చెందిన బత్తిని నాగేశ్వరరావు, మహేశ్వరి కుమార్తె మహన్య(6) స్థానిక ప్రైవేట్ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతుంది. ఈనెల 24న ఆమెకు జ్వరం రాగా ఆర్‌ఎంపీ వద్ద మూడు రోజులు చికిత్స చేయించారు. అయినా నయం కాకపోగా పరిస్థితి విషమించడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగానే తీవ్రజ్వరంతో బుధవారం అర్ధరాత్రి మృతి చెందింది. ఘటనపై డీఎంహెచ్‌ఓ వి.సుబ్బారావు ఆదేశాలతో పీహెచ్‌సీ వైద్యురాలు అలివేలు విచారణ చేపట్టి నివేదిక అందజేశారు. కాగా, మహన్య 'వైరల్ ఎన్‌సఫ్లయిటీస్' అనే జ్వరంతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

ధరణి ఆపరేటర్ మాయాజాలం..

- బదిలీ వేటుపడినా సత్తుపల్లిలోనే మళ్లీ పోస్టింగ్
- తీరు మారకపోవడంపై రైతుల్లో ఆందోళన


సత్తుపల్లి తహసీల్దార్ కార్యాలయం

సత్తుపల్లి: సత్తుపల్లి తహసీల్దార్ కార్యాలయంలోని ధరణి ఆపరేటర్ తీరు పలు భూవివాదాలకు కారణమవుతోంది. ధరణి సైట్‌లోని లొసుగులను వరంగా మార్చుకుంటున్న ఆయన తన చేతివాటంతో మాయాజాలం చేస్తున్నాడని ఆరోపిస్తున్నారు. సదరు ఆపరేటర్ పేరు చెబితేనే అధికారులు కూడా ఉలికి పడుతున్నారంటే అక్రమాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. 2023లో సత్తుపల్లి మండలం బేతుపల్లి రెవెన్యూ సర్వేనంబర్ 133/164/4లో ముత్తా వెంకటేశ్వరరావు పేరిట ఉన్న రెండెకరాల భూమిని ఇతరులపై అప్పట్లో ఆపరేటర్‌గా ఉన్న కె.చెన్నారావు మార్చాడు. ఇది కల్లూరు ఆర్డీఓ సూర్యనారాయణ చేపట్టిన విచారణలో నిర్ధారణ కావటం, మరికొందరు రైతుల భూముల రికార్డులు సైతం మారాయనే తేలడంతో ఆయను విధుల నుంచి తొలగించాలని సిఫారసు చేసినట్లు తెలిసింది. అయితే ఆనాటి తహసీల్దార్ సహకారంతో సింగరేణి మండలానికి బదిలీతో సరిపెట్టారు.

పహాణీ మారిన రైతు పేరు..

కాకర్లపల్లికి చెందిన మామిళ్లపల్లి రాధమ్మ భూమిని దమ్మపేట మండలం మందలపల్లికి చెందిన గారపాటి నారాయణమ్మ పేరుపైకి మార్చడంలో ధరణి ఆపరేటర్ చెన్నారావు చేతివాటం ప్రదర్శించారనే ఆరోపణలు వచ్చాయి. కోర్టు వివాదంలో ఉన్న భూమికి ధరణిలో పహాణీ లాక్ చేసినా తన నైపుణ్యంతో పేరు మార్చిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈవిషయమై పత్రికల్లో కథనాలు రావడంతో ఆయన బాధిత రైతు వద్దకు వెళ్లి 'బయటకు చెప్పవద్దు.. మళ్లీ పహాణీలో మామిళ్లపల్లి రాధమ్మ పేరు వచ్చేలా చేస్తా' అని కోరినట్లు తెలిసింది. ఓసారి పహాణీలో పేరు మారాక మళ్లీ మార్చడంటం కుదరని తహసీల్దార్ చెబుతుండగా.. ఆపరేటర్ మాత్రం యథాస్థితికి చేరుస్తున్నానని చెప్పడం ధరణిలోని లొసుగులకు అద్దం పడుతోంది.

కొన్నాళ్లకే పాత పోస్టింగ్

ఆరోపణలతో సింగరేణి మండలానికి బదిలీ అయిన ఆపరేటర్ చెన్నారావు మళ్లీ కొన్నాళ్లకే ఏడాదికే సత్తుపల్లి ధరణి ఆపరేటర్‌గా రావడం గమనార్హం. దీంతో ఆయనపై ఫిర్యాదు చేసిన రైతులు మళ్లీ తమ రికార్డుల విషయమై ఇబ్బంది పెడతాడని వాపోతున్నారు. అధికారులు కూడా పోస్టింగ్ విషయంలో అభ్యంతరం పెట్టినా రాజకీయ అండదండలతో వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. కాకర్లపల్లికి చెందిన అధికార పార్టీ నేత అయితే సదరు ఆపరేటర్ ఉంటే తమ భూములకు రక్షణ ఉండదని వాగ్వాదానికి దిగినట్లు సమాచారం.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..

ధరణి ఆపరేటర్ చెన్నారావుపై వచ్చిన ఆరోపణలపై ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తాం. ఇకపై ఎటువంటి అవకతవకలు జరగకుండా కట్టుదిట్టంగా వ్యవహరిస్తాం. ఆపరేటర్‌పై గతంలో వచ్చిన ఆరోపణలపైనా విచారణ చేపడతాం. ఎవరైనా రైతులకు నష్టం జరిగితే నేరుగా వచ్చి ఫిర్యాదు చేయవచ్చు.

– ఎల్.రాజేంద్రగౌడ్, కల్లూరు ఆర్డీఓ

అర్హులందరికీ రుణమాఫీ

రైతు కుటుంబాల నిర్ధారణకే సర్వే

వేంసూరు/సత్తుపల్లి రూరల్/కల్లూరు రూరల్: రుణమాఫీ కాని ప్రతీ రైతు కుటుంబ నిర్ధారణ కోసం సర్వే చేస్తామని జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య స్పష్టం చేశారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వేంసూరు, సత్తుపల్లి, కల్లూరు మండలాల్లో కుటుంబ నిర్ధారణ సర్వేను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. జిల్లాలో 50,068 మంది రైతుల కుటుంబాలను సర్వే చేస్తున్నామని తెలిపారు. ఇంకా ఎవరికైనా సందేహాలు ఉంటే మండల వ్యవసాయాధికారులను సంప్రదించాలని సూచించారు. కాగా, జిల్లాలో ఎక్కడా ఎరువుల కొరత లేదని, రైతుల అవసరాలకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని డీఏఓ తెలిపారు. సత్తుపల్లి ఏడీఏ శ్రీనివాసరెడ్డి, ఏఓలు రామ్మోహన్, వై.శ్రీనివాసరావు, ఎం.రూప, ఏఈఓలు నరేష్, ఆశాజ్యోతి పాల్గొన్నారు.


వేంసూరు : మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య

సీపీఐ నాయకుడు జాన్‌ఖాన్ మృతి

నివాళులర్పించి పాడె మోసిన ఎమ్మెల్యే కూనంనేని


జాన్‌ఖాన్ అంతిమయాత్రలో పాడె మోస్తున్న ఎమ్మెల్యే సాంబశివరావు

ఖమ్మంఅర్బన్: సీపీఐ నాయకుడు పఠాన్ జాన్‌ఖాన్(65) గుండెపోటుతో గురువారం మృతి చెందాడు. తల్లాడ మండలం పినపాకకు చెందిన ఆయన 25ఏళ్ల క్రితం ఖమ్మంకు వచ్చి ఇక్కడే సీపీఐ నాయకుడిగా పలు ఉద్యమాల్లో పాల్గొన్నారు. ఆయనకు భార్య ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, జాన్‌ఖాన్ మృతి వార్త తెలియగానే సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేరుకుని నివాళులర్పించడంతో పాటు ఆయన అంతిమ యాత్రలో పాడె మోశారు. ఆయన వెంట నాయకులు బాగం హేమంతరావు, పోటు ప్రసాద్, జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, నల్లమోతు నర్సింహారావు, ఏనుగు గాంధీ, నానబాల రామకృష్ణ, జాకీర్, ఉపేందర్, ఆముదాల వెంకన్న, అక్రం తదితరులు ఉన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి యువతి మృతి

బూర్గంపాడు: బావి వద్ద బట్టలు ఉతికేందుకు వెళ్లిన ఓ యువతి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందిన ఘటన సారపాకలోని గాంధీనగర్‌లో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సారపాక గాంధీనగర్‌కు చెందిన కొత్తూరు యాదగిరి కుమార్తె ఆదిలక్ష్మి(22) గురువారం తమ ఇంటి సమీపంలోని బావి వద్దకు బట్టలు ఉతికేందుకు వెళ్లింది. ఆమెకు చాలాకాలం నుంచి మూర్ఛవ్యాధి ఉంది. బట్టలు ఉతుకుతున్న సమయంలో మూర్ఛ వచ్చి ఆమె బావిలో పడిపోయింది. గమనించిన కుటుంబసభ్యులు స్థానికుల సాయంతో బావి నుంచి బయటకు తీసి భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

పరిహారం ఇప్పించాలని తప్పుడు కేసు

- కొట్టేసిన జిల్లా వినియోగదారుల ఫోరం

ఖమ్మంలీగల్: రోడ్డు ప్రమాదంలో వాహనంలోని సరుకులు కాలిపోయినందున పరిహారం ఇప్పించాలని నమోదు చేసిన కేసు తప్పు అని తేలడంతో కొట్టేస్తూ జిల్లా వినియోగదారుల ఫోరం చైర్మన్ వి.లత గురువారం తీర్పు వెలువరించారు. వివరాలిలా ఉన్నాయి. సెటప్ బాక్స్‌లను వాహనంలో తెప్పిస్తుండగా చెట్టుకు ఢీకొని కాలిపోవడంతో రూ.కోటి నష్టం జరిగిందని, ఆ మొత్తాన్ని న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి పరిహారంగా ఇప్పించాలని హైటెక్ డిజిటల్ కమ్యూనికేషన్ తరఫున కె.రజనీకుమార్‌రెడ్డి జిల్లా వినియోగదారుల ఫోరమ్‌లో ఫిర్యాదు చేశారు. కొన్నాళ్ల క్రితం ఈ ఫిర్యాదు నమోదు కాగా.. న్యూ ఇండియా ఇన్సూరెన్స్ బాధ్యులు మాత్రం ఎలాంటి ప్రమాదం జరగకున్నా తప్పుడు సమాచారంతో కేసు దాఖలు చేశారని సమాధానం ఇచ్చారు. దీంతో నివేదికలను పరిశీలించి సాక్షులను విచారించిన ఫోరమ్ చైర్మన్ లత తప్పుడు కేసుగా నిర్ధారించి కొట్టివేశారు. కాగా, న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ తరఫున బండారుపల్లి గంగాధర్ వాదించారు.

బీరువా పగులగొట్టి ఆభరణాలు చోరీ

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడులో బుధవారం రాత్రి ఓ ఇంట్లో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన యన్నం విజయలక్ష్మి భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లైబ్రేరియన్‌గా పనిచేస్తుండగా బుధవారం ఊరికి వెళ్లారు. ఆమె ఇంట్లో లేని విషయాన్ని గుర్తించిన దుండగులు అర్ధరాత్రి వేళ ఇంటి తాళం పగలకొట్టి లోనకు ప్రవేశించాక బీరువా తాళం సైతం తొలగించి రూ.50వేల విలువైన బంగారు ఆభరణాలు చోరీ చేశారు. ఈ విషయమై గురువారం ఉదయం విజయలక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్‌ఐ పి.వెంకటేష్ పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

ఆలయంలో...

వేంసూరు: మండలంలోని వెంకటాపురం అంకమ్మ తల్లి దేవాలయంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈమేరకు అమ్మవారి కిరీటాలు, కడియాలు, పట్టీలు, మంగళసూత్రాలు కలిపి మూడు కిలోల వెండి, 30 గ్రాముల బంగారం అపహరించారని ఆలయ కమిటీ సభ్యుడు చిలుకూరి సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఘటనపై ఆయన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వీరప్రసాద్ తెలిపారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

మధిరరూరల్: మండలంలోని నిధానపురం సమీపాన ముత్యాలమ్మ తల్లి గుడిలో జూన్ 11న చోరీ జరిగింది. ఈ కేసులో ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలుకు చెందిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు రెండు ఇత్తడి గంటలు, అమ్మవారి వెండి వడ్డాణానికి సంబంధించి నగదును రికవరీ చేసినట్లు మధిర రూరల్ ఎస్‌ఐ లక్ష్మీభార్గవి తెలిపారు. అలాగే, నిందితులను గురువారం కోర్టులో హాజరుపరిచి రిమాండ్ తరలించినట్లు వెల్లడించారు.

పేకాట ఆడుతున్న ఐదుగురి అరెస్టు

తిరుమలాయపాలెం: మండలంలోని సుబ్లేడు పరిధి ఓ పాత గ్రానైట్ క్వారీలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో ఎస్‌ఐ జగదీష్ సిబ్బందితో కలిసి గురువారం తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా సుబ్లేడుకు చెందిన లక్ష్మణ్, ప్రభాకర్, యోహాన్, నవీన్, ఉమేష్‌ను అదుపులోకి తీసుకుని రూ.2500 నగదు స్వాధీనం చేసుకోగా, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దాడి ఘటనలో కేసు నమోదు

చింతకాని: విదేశాల్లో చదువుతున్న ఇద్దరి నడుమ ఆర్థిక లావాదేవీల విషయమై చర్చించేందుకు వచ్చిన ఓ విద్యార్థిపై మరో విద్యార్థి తండ్రి దాడిచేయడంతో చింతకాని పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు... నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం మంగాపురం తండాకు చెందిన తరుణ్, చింతకాని మండలం నాగులవంచకు చెందిన అనగాని మంగారావు కుమారుడు జార్జియాలో ఎంబీబీఎస్ చదువుతున్నారు. అక్కడ వీరిద్దరికి ఆర్థిక లావాదేవీలపై వివాదం నెలకొంది. ఈక్రమంలో ఇటీవల స్వదేశానికి వచ్చిన తరుణ్ నగదు కోసం గురువారం నాగులవంచ చేరుకున్నాడు. డబ్బులు అడిగే క్రమాన మంగారావు తనపై దాడి చేయడమే కాక అసభ్య పదజాలంతో దూషించాడని ఆయన ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్ మీరా తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	6,830	5,000
మిర్చి	16,200	6,000
మిర్చి తాలు	6,000	6000
ఏసీ మిర్చి	19,300	8,000
ఏసీ తాలు	9,000	9,000
పత్తి	7,550	6,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర రూ.13,828

పొలాల్లో సోలార్ ప్లాంట్లు

- రైతులు 4 వేల మెగావాట్ల ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి
- పీఎం–కుసుం పథకం కింద కేంద్రం గ్రీన్‌సిగ్నల్
- ఉత్పత్తి అయిన విద్యుత్‌ను తప్పనిసరిగా కొనుగోలు చేయనున్న డిస్కంలు
- యూనిట్ విద్యుత్‌కు రూ.3.13 చెల్లించనున్న విద్యుత్ సంస్థలు



సాక్షి, హైదరాబాద్: ప్రధానమంత్రి కిసాన్ ఊర్జా సురక్షా ఏవం ఉత్థాన్ మహాభియాన్ (పీఎం–కుసుమ్) పథకం కింద రైతులు/రైతు సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రంలో 4 వేల మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల అనుమతిచ్చింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ పథకంలో చేరేందుకు ఆసక్తి ప్రదర్శించలేదు. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విజ్ఞప్తి చేయడంతో కేంద్రం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. అన్ని రాష్ట్రాలకు కలిపి ఇప్పటివరకు 8,112 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ల స్థాపనకు కేంద్రం అనుమతి ఇవ్వగా, అందులో అత్యధికంగా 4 వేల మెగావాట్ల ప్లాంట్లు రాష్ట్రా నికి సంబంధించినవే కావడం గమనార్హం. రైతులు వ్యక్తిగ తంగా లేదా ఇతరులతో కలిసి తమ పొలాల్లో 0.5 మెగా వాట్లు నుంచి 2 మెగావాట్ల సామర్థ్యం కలిగిన చిన్న సోలా ర్ పవర్ ప్లాంట్లను పెట్టుకోవడానికి అవకాశం కల్పిస్తారు. రెన్యువబుల్ పర్చేజ్ ఆబ్లిగేషన్ (ఆర్పీఓ) నిబంధనల ప్రకారం రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు ఏటా తప్పనిసరిగా కొంత శాతం పునరుత్పాదక విద్యుత్‌ను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. దీంతో ఈ ప్లాంట్‌ల ద్వా రా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను కూడా ఆర్పీఓ నిబంధనల కింద డిస్కంలు తప్పనిసరిగా రైతుల నుంచి కొనుగోలు చేయాల్సి ఉంటుంది. యూనిట్ విద్యుత్‌కు రూ.3.13 చొప్పున రైతులకు డిస్కంలు చెల్లించనున్నాయి. రైతుల నుంచి కొనుగోలు చేసే ప్రతి యూనిట్ విద్యుత్‌కు 0.40 పైసలు చొప్పున ఐదేళ్ల పాటు డిస్కంలకు కేంద్ర పునరు త్పాదక ఇంధన శాఖ ప్రోత్సాహకంగా అందించనుంది.

పెట్టుబడిలో 30% రైతుల వాటా

రైతులు స్వయంగా తమ స్థలాల్లో ప్లాంట్ పెట్టుకోవచ్చు. లేకుంటే సహకార సంఘాలు/పంచాయతీలు/రైతుల గ్రూపులు/నీటి వినియోగ సంఘాలతో కలిసి ఏర్పాటు చేయవచ్చు. ఆర్థిక స్తోమత లేకుంటే డెవలపర్లకు తమ స్థలాలను లీజుకు ఇచ్చి ప్లాంట్ పెట్టించవచ్చు. మెగావాట్ సౌర విద్యుత్ ప్లాంట్ ద్వారా ఏటా సగటున 16 లక్షల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి కానుండగా, రైతులు/డెవలపర్లకు రూ.50.08 లక్షల ఆదాయం రానుంది. అయితే సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు వ్యయం మెగావాట్‌కు రూ.4 కోట్ల నుంచి రూ.4.5 కోట్ల వరకు కానుంది. ఇందులో రైతులు 30 శాతం పెట్టుబడి పెడితే మిగిలిన 70 శాతం మూలధనాన్ని బ్యాంకులు రుణంగా ఇచ్చే అవకాశం ఉంటుంది. 10–12 ఏళ్లలో రైతుల పెట్టుబడి మొత్తం తిరిగి వచ్చే అవకాశం ఉందని తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (రెడ్కో) జనరల్ మేనేజర్ జీఎస్‌వీ ప్రసాద్ 'సాక్షి'కి తెలిపారు.

త్వరలో ఆసక్తి వ్యక్తీకరణకు ఆహ్వానం..

డిస్కంలు తమ 33/11 కేవీ, 66/11 కేవీ, 110/11 కేవీ సబ్ స్టేషన్ల వారీగా వాటి పరిధిలో ఎంత సామర్థ్యం మేరకు సోలార్ పవర్ ప్లాంట్లు పెట్టేందుకు అవకాశం ఉందో గుర్తించి తమ వెబ్‌సైట్‌లో ప్రకటించాల్సి ఉంటుంది. ఇప్పటికే రాష్ట్రంలో ఈ ప్రక్రియ పూర్తైంది. త్వరలో రైతుల నుంచి ఆసక్తి వ్యక్తీకరణను ఆహ్వానిస్తూ డిస్కంలు ప్రకటన జారీ చేయనున్నాయి. ఆసక్తి గల రైతులు/డెవలపర్లు మెగావాట్‌కు రూ.,5000కి మించకుండా ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. రైతులు/డెవలపర్లు కుదుర్చుకునే విద్యుత్ కొనుగోలు ఒప్పందం ఆధారంగా రైతులు/డెవలపర్లకు బ్యాంకులు రుణం ఇవ్వనున్నాయి.



కొలనుపాకలోని సోమేశ్వరాలయంలో శిలాశాసనాన్ని పరిశీలిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతోంది

- ఓబుల్‌కేశ్వాపూర్ గ్రామస్తుల ఐకమత్యం బాగుంది
- జనగామ, భువనగిరి జిల్లాల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటన
- అవార్డు గ్రహీతలను కలిసిన గవర్నర్

జనగామ, సాక్షి యాదాద్రి: తెలంగాణ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రశంసించారు. ఇక్కడకు గవర్నర్‌గా వచ్చిన తర్వాత మొట్టమొదటిసారిగా ఓ మారుమూల గ్రామానికి రావడం సంతోషాన్ని కలిగించిందని అన్నారు. గురువారం జనగామ, భువనగిరి జిల్లాల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటించారు. రెండు జిల్లాల కలెక్టర్ కార్యాలయాల్లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. వివిధ రంగాల ప్రముఖులు, కవులు, కళాకారులు, రచయితలతో భేటీ అయ్యారు. జనగామ మండలం ఓబుల్‌కేశ్వాపూర్ గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర ఆలయంలో స్వామి వారి కల్యాణంలో పాల్గొని వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్న తర్వాత ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రజలు చాలామంచి వ్యక్తులని, అందులో ఓబుల్‌కేశ్వాపూర్ గ్రామస్తుల ఐకమత్యం సంతోషం కలిగించిందన్నారు. ఊరిలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం కొద్దిరోజుల్లో టూరిస్టు సెంటర్‌గా మారబోతుందని చెప్పారు. అంతకుముందు జనగామ జియోగ్రాఫికల్ వివరాలను పవర్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ గవర్నర్‌కు వివరించారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్లు పింకేశ్ కుమార్, రోహిత్‌సింగ్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక, సాహిత్యంలో యాదాద్రి టాప్..

సాంస్కృతిక, సాహిత్య, ఆధ్యాత్మిక రంగాల్లో యాదాద్రి భువనగిరి జిల్లా ఎంతో ప్రసిద్ధి చెందిందని గవర్నర్ అన్నారు. వివిధ రంగాలలో అవార్డు గ్రహీతలను ఆయన అభినందించారు. స్వాతంత్ర్య సమరయోధులు మన్నె గోపాలరెడ్డి, కూరెళ్ల విఠలాచార్య, కేతావత్ సోమ్లానాయక్‌లను గవర్నర్ శాలువాలతో సత్కరించారు. పద్మశ్రీ అవార్డు గ్రహీతలు గజం గోవర్ధన్, గజం అంజయ్య, చింతకింది మల్లేశం, కూరెళ్ల విఠలాచార్య, కేతావత్ సోమ్లా నాయక్, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీతలు డాక్టర్ ఎన్.గోపి, నిఖిలేశ్వర్, కాళోజీ పురస్కార గ్రహీత శ్రీరామోజు హరగోపాల్, జాతీయ ఉత్తమ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, రాష్ట్ర ప్రభుత్వ యువ పురస్కార గ్రహీత తిరునగరి శ్రీనివాస్, పర్వతారోహకురాలు పడమటి అన్వితారెడ్డి, నంది అవార్డు గ్రహీత ఎం.డి.అబ్దుల్, శరత్‌చంద్ర ఛటోపాధ్యాయ జాతీయ పురస్కార గ్రహీత డాక్టర్ షేక్ అబ్దుల్ ఘని, తెలుగు విశ్వవిద్యాలయం పురస్కార గ్రహీత లింగంపల్లి రామచంద్రం తదితరులతో గవర్నర్ సమావేశమయ్యారు. అనంతరం వారితో కలిసి రాత్రి భోజనం చేశారు.

ఆలయాల సందర్శన: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆలేరు మండలం కొలనుపాక జైన దేవాలయాన్ని సందర్శించారు. అదేవిధంగా శ్రీ చండికాంబ సహిత సోమేశ్వర దేవాలయాలను సందర్శించిన గవర్నర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భువనగిరి సమీపంలోని స్వర్ణగిరి దేవాలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీఎం హోదాలో ఉండి సుప్రీం తీర్పుపై వ్యాఖ్యలా!

▶ మొదటి పేజీ తరువాయి

జరగనివ్వండి' అంటూ జస్టిస్ గవాయి ఘాటుగా వ్యాఖ్యానించారు.

పదే పదే అలాంటి వ్యాఖ్యలా?

'ఆ తరహా వ్యాఖ్యలు..మళ్లీ గురువారం ఉదయం కూడా! బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రిగా పదవి చేపట్టిన తొలి వంద రోజుల్లోనే ఈ తరహా స్టేట్‌మెంట్లు ఇవ్వడాన్ని ఓసారి గుర్తుకు తెచ్చుకోండి. కోర్టుపై ఆక్షేపణలు చేశారు. ముఖ్యమంత్రి పదవిలో ఉన్న వ్యక్తి చేసే బాధ్యతాయుతమైన ప్రకటనేనా ఇది? న్యాయవ్యవస్థకు ఆమడ దూరంలో ఉండడమే కార్యనిర్వాహకుల ప్రాథమిక విధి. విమర్శించండి.. కానీ ఆక్షేపణలు వద్దు..' అని జస్టిస్ విశ్వనాథన్ స్పష్టం చేశారు.

అలాగైతే న్యాయాధికారులపై విశ్వాసం లేనట్లే అవుతుంది

'ఓటుకు నోటు కేసు విచారణ బదిలీ చేయాలన్న పిటిషన్లు విచారణకు స్వీకరిస్తే న్యాయాధి కారులపై కోర్టుకు విశ్వాసం లేనట్లే అవుతుంది. ఎన్నికల సమయంలో ఇలాంటి పిటిషన్లు దాఖలు చేస్తారు. చట్టసభల్లో జోక్యం చేసుకోబోమని చెబుతుంటాం. వారికీ ఇది వర్తిస్తుంది' అని జస్టిస్ గవాయి పేర్కొన్నారు.

దర్యాప్తు పారదర్శకంగా జరిగే అవకాశం లేదు: పిటిషనర్ల తరఫు న్యాయవాది

వ్యాఖ్యల సవరణకు ప్రయత్నిస్తామని తెలంగాణ ప్రభుత్వం తరఫు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయ వాది ముకుల్ రోహత్గీ తెలిపారు. అయితే జరగాల్సిన నష్టం ఇప్పటికే జరిగిపోయిందని, అటువంటి వ్యాఖ్యలు న్యాయమూర్తులపై ఒత్తిడి తీసుకురావడంతోపాటు దిగువ కోర్టులకూ వ్యాపించే అవకాశం ఉందని పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది సి.సుందరం పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి ప్రస్తుతం సీఎం కావడంతో పాటు ఏసీబీని కూడా తన అధికార పరిధిలో ఉంచుకున్నారని, దర్యాప్తు పారదర్శకంగా జరిగే అవకాశం ఉండదని అన్నారు. దర్యాప్తు అధికారులు కూడా మారారని చెప్పారు. గతంలో దాఖలు చేసిన కౌంటరుకు సంబంధించి సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని న్యాయస్థానం దృష్టికి తెచ్చారు. పోలీసులపై కూడా రేవంత్‌రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని తెలిపారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అని, ఏ వ్యక్తీ తన సొంత విషయంలో న్యాయమూర్తి కాకూడదనే సహజ న్యాయసూత్రం గుర్తుచేశారు.

న్యాయవ్యవస్థపై విశ్వాసం ఉంచాలి

ఈ దశలో జోక్యం చేసుకున్న ధర్మా సనం.. స్వతంత్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమిస్తే దర్యాప్తుపై విశ్వాసం పెరిగే అవకాశం ఉంటుందని అభిప్రాయపడింది. గతంలో దర్యాప్తుపై స్టే ఇచ్చిన అంశం, సీబీఐకి బదిలీ తదితర అంశాలపై ఆరా తీసింది. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకంపై తెలంగాణకు చెందిన సహచరుల ను సంప్రదిస్తామని తెలిపింది. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమిస్తామని, అయితే ప్రస్తుత పిటిషన్‌ను కొట్టివేస్తామని పేర్కొంది. న్యాయవ్యవస్థపై పూర్తి విశ్వాసం ఉంచాలని, అందరికీ విశ్వాసం కలిగేలా నియామకం చేపడతామని జస్టిస్ గవా యి చెప్పారు. ప్రస్తుత పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేంద్రరావుతో పాటు మరో న్యాయవాది ఉమా మహేశ్వరరావు ఉత్తమమని భావిస్తున్నామన్నారు. అయితే తమకు పోలీసు అధికారుల విష యంలో ఆందోళన ఉందని పిటిషనర్ల తరఫు మరో సీనియర్ న్యాయవాది శేషా ద్రినాయుడు చెప్పారు. అనంతరం తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది.

తిరిగి ప్రజాక్షేత్రంలోకి కేసీఆర్!

▶ మొదటి పేజీ తరువాయి

జనంలోకి వెళ్లాలని పార్టీ నేతలు సూచిస్తున్నట్లు తెలిసింది.

రుణమాఫీ, రైతు బంధు వైఫల్యంపై..

రాష్ట్ర రైతాంగం ఎదుర్కొంటున్న సాగునీరు, విద్యుత్ కష్టాలతోపాటు రుణమాఫీ జరగక పోవడం, రైతుబంధు ఇవ్వకపోవడం వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేసీఆర్ భావిస్తున్నారు. బీఆర్ఎస్ పాలనలో రైతు సంక్షేమం కేంద్రంగా అమలు చేసిన కార్యక్రమాలను వివరించడంతోపాటు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలనే యోచనలో కేసీఆర్ ఉన్నారు. రుణమాఫీ, రైతు భరోసా అంటూ ఎన్నికల హామీలను ఉల్లంఘిస్తున్న వైనాన్ని కేసీఆర్ ఎండగట్టనున్నారు. దీని కోసం లోక్‌సభ ఎన్నికల ప్రచారం తరహాలో బస్సు యాత్ర పెట్టాలా లేక భారీ సభలు నిర్వహించాలా అనే కోణంలో పార్టీ నేతలతో చర్చిస్తున్నారు. నియోజకవర్గాల వారీగా పార్టీ కేడర్, రైతులతో సభలు నిర్వహిస్తే ఎలా ఉంటుందనే కోణంలోనూ కసరత్తు జరుగుతోంది.

అమెరికా పర్యటనకు కేటీఆర్: కేటీ రామారావు బుధవారం రాత్రి అమెరికా పర్యటనకు వెళ్లారు. బుధవారం సాయంత్రం ఢిల్లీ నుంచి సోదరి కవితతోపాటు హైదరాబా ద్‌కు చేరుకున్న కేటీఆర్ కొద్ది గంటల వ్యవధిలోనే అమెరికాకు వెళ్లారు. తన కుమారుడు హిమాన్షుకు సంబంధించిన విద్యాపరమైన విషయాల కోసం అమెరికాకు వెళ్లి నట్లు సమాచారం. సెప్టెంబర్ రెండోవారంలో కేటీఆర్ తిరిగి హైదరాబాద్‌కు వస్తారని సమాచారం. ఇదిలా ఉంటే 'తండ్రి బాధ్య తల్లో అమెరికాకు వెళ్తున్నా' అనే అర్థం వచ్చేలా కేటీఆర్ 'ఎక్స్'లో పోస్ట్‌పెట్టారు.

ఆడబిడ్డకు ఆత్మీయ స్వాగతం

- ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌కి చేరుకున్న కవిత
- ఆప్యాయంగా హత్తుకున్న కేసీఆర్

మర్కూక్/గజ్వేల్/సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో బెయిల్‌పై విడుదలైన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఫామ్‌హౌస్‌లో ఆత్మీయ స్వాగతం లభించింది. మూడు రోజుల క్రితం బెయిల్‌పై విడుదలై హైదరాబాద్‌కు చేరుకున్న కవిత గురువారం బంజారాహిల్స్‌లోని తన నివాసం నుంచి భర్త అనిల్ కుమార్, కుమారుడితో కలిసి ఎర్రవల్లికి వెళ్లారు. ఎర్రవల్లిలోని నివాసానికి చేరుకున్న కవితను ఆమె తండ్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆప్యాయంగా హత్తుకున్నారు. కేసీఆర్ పాదాలకు నమస్కరించి తండ్రి చేతిని కవిత ఆప్యాయంగా ముద్దాడారు. కేసీఆర్ పాదాలకు కవిత నమస్కరిస్తున్న సమయంలో ఎర్రవల్లి నివాసంలో ఉద్విగ్న వాతావరణం కనిపించింది. పలువురు మహిళలు కవితకు దిష్టితీసి మంగళహారతులతో స్వాగతం పలికారు. అప్పటికే ఫామ్‌హౌస్‌లో ఉన్న ఎంపీ జోగినపల్లి సంతోష్, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, మాజీ టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, మాజీ పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు కూడా కవితకు స్వాగతం పలికారు. కవిత రెండు గంటలకుపైగా ఫామ్‌హౌస్‌లో గడిపి తిరిగి హైదరాబాద్‌కు వెళ్లిపోయారు.

జిల్లా వార్తలు

ఆశలు ఆవిరైనట్లే...

- మిర్చి నిల్వ చేసినా దక్కని ఫలితం
- సీజన్‌తో పోలిస్తే క్వింటాకు రూ.5వేలకు పైగానే నష్టం
- విదేశీ ఎగుమతులు లేక ధరపై ప్రభావం
- పునరావృతమైన 2011 నాటి పరిస్థితి



ఎగుమతి కోసం మిర్చిని గ్రేడింగ్ చేయిస్తున్న వ్యాపారులు (ఫైల్)

ఖమ్మంవ్యవసాయం: కొన్నాళ్లు వేచి ఉంటే మిర్చికి మంచి ధర వస్తుందనే భావనతో నిల్వ చేసిన రైతులు, వ్యాపారుల ఆశలు గల్లంతయ్యాయి. సాధారణంగా పంటలకు అన్ సీజన్‌లో ధర పెరిగే అవకాశమున్నా, ఈసారి అలా జరగకపోవడం గమనార్హం. డిసెంబర్ నుంచి మే వరకు మిర్చి సీజన్‌గా, జూన్ నుంచి నవంబర్ వరకు అన్ సీజన్‌గా చెబుతారు. గత సీజన్‌లో మిర్చి రెండో కోత ఫిబ్రవరిలో చేతికి రాగా మార్చి, ఏప్రిల్‌ల్లో నాణ్యత ఆధారంగా క్వింటాకు రూ.21వేల నుంచి రూ.22వేల ధర పలికింది. సీజన్ ముగిశాక ధర పెరుగుతుందని నిల్వ చేస్తే... ఆనాటి ధర కూడా రాకపోవడంతో భారీగా నష్టపోయే పరిస్థితి నెలకొంది.

ధర తగ్గి.. నిల్వ భారమై

గత ఏడాది అన్ సీజన్‌లో మిర్చి ధర రూ.24 వేల మేర పలికింది. అదే నమ్మకంతో ఈసారి దాదాపు 40 లక్షల మిర్చి బస్తాలను రైతులు, వ్యాపారులు నిల్వ చేయగా.. ప్రస్తుతం 28లక్షల నుంచి నుంచి 30లక్షల బస్తాల మేర నిల్వ ఉన్నాయి. కానీ గత ఏడాది మాదిరి పరిస్థితులు లేక నిల్వ చేసిన క్వింటాకు రూ.5వేల నుంచి రూ.6వేల మేర నష్టాన్ని చవిచూడాల్సి వస్తోంది. సీజన్‌లో రూ.21వేల నుంచి రూ.22వేల వరకు ఉన్న ధర ఇప్పుడు రూ.17వేల నుంచి రూ.18 వేల వరకే పలుకుతోంది. ఫలితంగా రూ.4వేల వరకు నష్టపోగా.. నిల్వ చేసినందున రూ.600, తరుగు రూ.500, హమాలీ ఖర్చులు రూ.300, వడ్డీ రూ.300, రవాణా తదితర ఖర్చులు రూ.200 మేర కలిపితే క్వింటా మిర్చికి రూ.6వేల వరకు నష్టం ఎదురవుతోందని చెబుతున్నారు.



విక్రయాల సందడి కానరాని కోల్డ్ స్టోరేజీ

'తేజా'ను పోలిన రకాలు

విదేశీ ఎగుమతులు లేకపోవడమే మిర్చి ధర పడిపోవడానికి కారణంగా వ్యాపారులు విశ్లేషిస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు పరిసర జిల్లాల్లో పండించే 'తేజా'రకం మిర్చికి చైనా, థాయ్‌లాండ్, మలేషియా, సింగపూర్, బంగ్లాదేశ్ తదితర దేశాల్లో డిమాండ్ ఉంటుంది. అయితే, ఈ ఏడాది తేజాను పోలిన ఇతర రకాల మిర్చి పలు రాష్ట్రాల్లో అందుబాటులోకి వచ్చింది. పశ్చిమబెంగాల్‌లో సుందరి, ఉత్తరప్రదేశ్‌లో బరెల్లి, కర్ణాటకలో బాడిగె తదితర రకాల ధరలు రూ.12వేల నుంచి రూ.13వేల వరకే వస్తుండడంతో ఎగుమతిదారులు అటే మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా క్వింటాకు రూ.20వేల పైన ధర పలికే తేజా రకానికి డిమాండ్ తగ్గిందని తెలుస్తోంది.

13ఏళ్ల క్రితం ఇలాగే...

అన్ సీజన్‌లో మిర్చి ధర పతనం అనేది 13 ఏళ్ల తర్వాత పునరావృతమైంది. 2011లో పంట సీజన్‌లో మిర్చి ధర రూ.9వేల నుంచి రూ.10 వేల వరకు పలకగా రైతులు నిల్వ చేశారు. కానీ అన్ సీజన్ కొచ్చేసరికి రూ.4వేల నుంచి రూ.6వేల మధ్యే పలకడంతో విపరీతమైన నష్టం ఎదురైంది. ప్రస్తుతం పరిస్థితుల్లో రైతులు, వ్యాపారులు ఆనాటి పరిస్థితులను గుర్తుచేస్తున్నారు.

55 క్వింటాళ్లు నిల్వ చేశా...



నాలుగు ఎకరాల్లో మిర్చిని సాగు చేయగా.. రెండో కోత 55 క్వింటాళ్లకు మంచి ధర వస్తుందని కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేశా. అప్పట్లో క్వింటా రూ.21,800కు ఉండగా.. ఇప్పుడు రూ.18 వేల ధరే ఉంది. ధర పెరుగుతుందనుకుంటే తగ్గింది. ఇప్పుడు ఏం చేయాలో అర్థం కావడం లేదు.

– ఎలకొండ శ్రీను, కొక్కిరేణి, తిరుమలాయపాలెం మండలం

ధర వస్తుందనే నమ్మకంతో...



అన్ సీజన్‌లో ధర వస్తుందని 50 బస్తాల మిర్చిని నిల్వ చేశా. అప్పుడు రూ.22వేలు ఉన్న ధర పెరుగుతుందని అనుకుంటే రూ.18 వేలకు మించి ధర లేదు. అయినా వ్యాపారులు కొనుగోలు చేయడంలేదు. ఖర్చులన్నీ కలిపి క్వింటాకు రూ.5వేలకు పైగా నష్టపోవాల్సి వస్తోంది.

– ఇనుకుర్తి బ్రహ్మారెడ్డి, పందిళ్లపల్లి, చింతకాని మండలం

అంచనాలు తలకిందులు..



విదేశాలకు తేజ రకం మాత్రమే ఎగుమతి అయ్యేది. వివిధ రాష్ట్రాల్లో తేజాను పోలిన రకాలు తక్కువ ధరకే వస్తుండడంతో ఇక్కడ ధరపై ప్రభావం పడింది. అంతేకాక విదేశీ ఎగుమతులు మందగించాయి. అక్కడ నిల్వలు ఉండడంతో ఆశించినంత మేర ఎగుమతులు లేవు.

– యద్లపల్లి సతీష్‌కుమార్, చాంబర్ మిర్చి శాఖ కార్యదర్శి

రుణమాఫీపై ప్రతిపక్షాల విమర్శలు తిప్పికొట్టాలి



కార్యకర్తలతో మాట్లాడుతున్న రాయల నాగేశ్వరరావు

నేలకొండపల్లి: రైతుల రుణమాఫీపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. నేలకొండపల్లిలో గురువారం ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో రూ.2 లక్షల వరకు ఉన్న రుణాలను మాఫీ చేసిందని తెలిపారు. అయితే, కొందరికి సాంకేతిక కారణాలతో జమ కాకపోయినా సర్వే చేయిస్తున్నామని చెప్పారు. ఈక్రమంలో ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ తట్టుకోలేని ప్రతిపక్షాల నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నందున కాంగ్రెస్ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆతర్వాత పలువురు కార్యకర్తలతో నాగేశ్వరరావు పలు అంశాలపై చర్చించారు. నాయకులు బచ్చలకూరి నాగరాజు, బోయిన వేణు, కె.నాగేశ్వరరావు, జెర్రిపోతుల సత్యనారాయణ, అంజిని, కడియాల నరేష్, నాగేంద్ర, సాయినవీన్, విజయ్, పగిడికత్తుల సుదర్శన్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై 1 నుంచి ఆందోళనలు



సమావేశంలో మాట్లాడుతున్న మాధవనాయక్

సింగరేణి(కొత్తగూడెం): దేశవ్యాప్తంగా బొగ్గు పరిశ్రమలతో పాటు సింగరేణిలో కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల సాధన కోసం సెప్టెంబర్ 1 నుంచి ఆందోళనలు నిర్వహించాలని నాగ్‌పూర్‌లో ఇటీవల జరిగిన సమావేశాల్లో నిర్ణయించినట్లు బీఎంఎస్ జాతీయ నాయకుడు పి.మాధవనాయక్ తెలిపారు. కొత్తగూడెంలోని బీఎంఎస్ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 10వ తేదీ వరకు ప్రతీ గనిలో గేట్‌మీటింగ్‌ల నిర్వహించడంతో పాటు 26న జీఎం కార్యాలయాల వద్ద ధర్నాలు, 30న కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట మహా ధర్నా చేపడుతామని పేర్కొన్నారు. ఈమేరకు కార్మికులు సంఘాలకతీతంగా హాజరు కావాలని కోరారు. వేజ్‌బోర్డ్ ఒప్పందాలు అమలు, అన్ని ఏరియాల్లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల ఏర్పాటు చేయడంతో పాటు సీఎంపీఎఫ్‌లో అవినీతి విచారణ జరిపించాలన్న ప్రధాన డిమాండ్లతో ఈ ఆందోళనలు జరుగుతాయని తెలిపారు. ఈసమావేశంలో నాయకులు జీ.వీ.కృష్ణారెడ్డి, టీఎస్.పవన్‌కుమార్, రాంసింగ్, మొగిలిపాక రవికుమార్, ఊట్ల గణేష్, వి.నాగప్రసాద్, ఐ.నాగేశ్వరరావు, జి.వెంకటరెడ్డి, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అటు మున్సిపాలిటీ, ఇటు పంచాయతీ


- జీసీసీ బంక్ ఏర్పాటుకు దక్కని ఎన్‌ఓసీ
- ఫలితంగా కబ్జా అవుతున్న ప్రభుత్వ స్థలం



పాల్వంచలోని జీసీసీ కార్యాలయం

పాల్వంచరూరల్: పాల్వంచలో గిరిజన సహకార సంస్థ(జీసీసీ) స్థలంలో పెట్రోల్‌బంక్ ఏర్పాటుకు నిర్ణయించినా సరిహద్దు సమస్యతో ఏళ్ల తరబడి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్(ఎన్‌ఓసీ) అందడం లేదు. ఫలితంగా జీసీసీ ఆదాయం కోల్పోతుండగా విలువైన ప్రభుత్వ స్థలం కబ్జాకు గురవుతోంది. పాల్వంచలోని జీసీసీ బ్రాంచ్ మేనేజర్ కార్యాలయం పరిధిలో నాలుగు ఎకరాల 8 కుంటల స్థలం ఉండగా.. ఇది కొంత లక్ష్మీదేవిపల్లి గ్రామపంచాయతీ, ఇంకొంత పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలో ఉంది. ఈమేరకు కార్యాలయం పోగా ఖాళీస్థలంలో పెట్రోల్‌బంక్ ఏర్పాటుచేయాలని హెచ్‌పీఎల్ సంస్థను కోరగా 2019లో మంజూరు చేశారు. అప్పటి నుంచి ఎన్‌ఓసీ కోసం మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతుండగా ఎటూ తేల్చడం లేదు. ఇదేమిటని ఆరా తీయగా స్థలం కొంత మున్సిపాలిటీ పరిధిలో, ఇంకొంత జీపీ పరిధిలో ఉండడమే కారణమని తేలింది. ఈ విషయాన్ని ఐటీడీఏ పీఓల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించలేదు. ఇంతలోనే జీసీసీ పరిధిలోని కొంత స్థలంలో హమాలీ కాలనీకి చెందిన పలువురు రేకుల షెడ్లు వేయడంతో పాటు గుడి నిర్మించారు. దీంతో అధికారులు ఖాళీ చేసి బంక్ ఏర్పాటుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కాగా, బంక్ ఏర్పాటైతే జీసీసీకి ఆదాయం సమకూరడమే కాక స్థానిక గిరిజన యువతకు ఉపాధి లభిస్తుందని చెబుతున్నారు.

ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు



జీసీసీ స్థలం కబ్జా కాకుండా ప్రహరీ నిర్మించాలంటే రూ.7లక్షలకు పైగా వ్యయమవుతుంది. ఈవిషయమై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. అనుమతి వచ్చే వరకు రూ.50వేల వ్యయంతో ఇనుప కంచెతో ఫెన్సింగ్ వేయిస్తాం. అలాగే, బంక్ ఏర్పాటుకు ఎన్‌ఓసీ జారీలో సమస్యపై పీఓ, తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లాం. అటు మున్సిపాలిటీ, ఇటు జీపీ ద్వారా రెండు సర్టిఫికెట్లు తీసుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నాం.

– లక్ష్మోజీ, జీసీసీ బ్రాంచ్ మేనేజర్, పాల్వంచ

మకరతోరణం వితరణ



ఉద్యోగులకు మకర తోరణం అందజేస్తున్న దాతలు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానం ప్రాంగణంలోని ఉపాలయమైన వేంకటేశ్వరస్వామికి భక్తులు గురువారం వెండి మకరతోరణం సమర్పించారు. భద్రాచలం తాత గుడి సెంటర్‌కు చెందిన చారుగుళ్ల పద్మ వెంకటరమణ – దీప్తి శ్రీదేవి దంపతులు రెండు కేజీల వెండితో చేయించిన రూ.1.80లక్షల విలువైన మకరతోరణం తయారు చేయించారు. ఈమేరకు పూజలు జరిపి ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబుకు అందజేశారు.

మావోయిస్టుల డంప్ లభ్యం



స్వాధీనం చేసుకున్న మావోయిస్టుల డంప్

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లాలో భద్రత బలగాలే లక్ష్యంగా మావోయిస్టులు ఏర్పాటు చేసిన ఐఈడీ బాంబ్‌ను బలగాలు నిర్వీర్యం చేయగా, మరోచోట భారీ డంప్‌ను స్వాధీనం చేసుకున్నాయి. సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్‌చవాన్, అధికారుల ఆధ్వర్యాన కుంట, కిష్టారం ఏరియాలో కూంబింగ్ చేపట్టారు.చింతగుఫా క్యాంపు నుంచి పటాదులాడ్ చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలిస్తుండగా బలగాలను హతమార్చేందుకు మావోయిస్టులు అమర్చిన ఆరు కిలోల పైపు బాంబును గుర్తించి నిర్వీర్యం చేశారు. అలాగే, కిష్టారం పోలీస్‌స్టేషన్ పరిధి డబ్బమార్క క్యాంప్ నుంచి భద్రత బలగాలు ఛోటేకెడ్వాల్, సింగనమడ్గు, కమరం అటవీ ప్రాంతాల్లో గాలిస్తుండగా వీరిని చూసి మావోయిస్టులు పారిపోయారు. అనంతరం చెట్ల పొదల మధ్య దాచిన డంప్‌ను గుర్తించాయి. ఇందులో భారీ సంఖ్యలో తుపాకులు, డిటోనేటర్లు, మందులు, తుపాకీ తదితర పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.